
## విజయవంతంగా ఆపరేషన్ కవచ్




2



2

## ప్రాణ సంకటంగా మారిన కలెక్టరేట్ రహదారి



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatodaynews.com





## పదోన్నతి పొందిన ఎస్సైలకు సీపీ అభినందన


**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని 11 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి లభించింది. గురువారం వారు పోలీస్ కమిషనర్ సాయి చైతన్యను మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా పదోన్నతి కోసం ఎదురుచూస్తున్న సిబ్బందికి ఎస్సైలుగా ప్రమోషన్ రావడంపై ఆనందం వ్యక్తం చేశారు. పదోన్నతులు బాధ్యతలు పెంచుతాయన్నారు.




## ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటిమట్టం.. ఆనందంలో అన్నదాతలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి/ఆర్మూర్:** ఉమ్మడిజిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రాజెక్టులు జీవకలను సంతరించుకుంటున్నాయి. నిజాంసాగర్ ప్రాజెక్టు లో ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 3,935 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 17.802 టీఎంసీలుగా కాగా ప్రస్తుతం 7.466 టీఎంసీల నీరు ఉంది. పోచారం ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుండి వరద నీటి ప్రవాహం కొనసాగుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి వరద కొనసాగుతోంది. ఇన్‌ఫ్లో రూపంలో 9,240 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 1,091 అడుగులు 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 1,065 అడుగులు 17.103 టీఎంసీల నీటి నిలువ ఉంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తూ వరద నీరు చేరడంతో ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు రైతులు ఖరీఫ్ పంటలకు సిద్ధమవుతున్నారు.






పేదింటి ఆడబిడ్డ కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు ప్రారంభించిన కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలు అక్రమార్కులకు వరంగా మారాయి. గెజిటెడ్ సంతకాలను ఫోర్జరీ చేస్తూ ఓ ముఠా లబ్ధిదారుల నుంచి అందినంత దోచుకుంది. ఈ ముఠా గట్టురట్టు చేసిన పోలీసులు వారిని కటకటాల వెనక్కి పంపారు. అయితే ఈ సంతకాల ఫోర్జరీ, నకిలీ స్టాంపుల కేసులో విచారణ ముందుకు సాగుతుందా.. లేదా అనే అనుమానాలు పలువురిలో వ్యక్తమవుతున్నాయి. - అక్షరటుడే, కామారెడ్డి

# ‘ఫోర్జరీ సంతకాల’ విచారణ సాగేనా..?

▸ ప్రభుత్వ పథకాలకు ఎసరు పెట్టేలా ఘటన ▸ కామారెడ్డిలో కలకలం రేపిన ఫోర్జరీ కేసు
▸ సూత్రధారులు.. పాత్రదారుల పని పడతారా..? ▸ స్టాంపులు తయారీ చేసిందెవరో తేలేనా..!

భిక్కనూర్ మండలం లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులపై గెజిటెడ్ హోదా ఉన్న జీజీహెచ్ ఆర్ఎంవో సంతకం ఫోర్జరీ, నకిలీ స్టాంపులు వేసిన ఘటనపై పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. విచారణలో అరకొరగా సమాచారం రావడంతో మరోసారి నిందితులను కస్టడీకి కోరి విచారణ చేపట్టనున్నారు.

అయితే అన్నీ తామై వ్యవహరిస్తున్న ప్రధాన నిందితుడి గుట్టు పోలీసులు వెలికి తీస్తారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రధాన నిందితునిగా ప్రకటించిన పోలీసులు అతడిని ఏ-3 గా చూపడంతో ఈ అనుమానాలకు బలం చేకూరుతోంది.

### నకిలీ స్టాంపులపై..

ఈ దందాకు సూత్రధారిగా చెబుతున్నది బోయిని ప్రసాద్. జీజీహెచ్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న అతడికి భిక్కనూర్ మండల కేంద్రంలో జిరాక్స్ షాప్, ఇంటర్నెట్ సెంటర్ ఉంది. అక్కడే నకిలీ దరఖాస్తులు, సర్టిఫికెట్లు తయారు చేసి ఈ వ్యవహారం నడిపినట్లు ఆరోపణలు ఉన్నాయి. నకిలీ స్టాంపులను ఎక్కడ చేయించాడు, ఎంతమందికి సప్లయ్ చేశాడు అనేది ఇంకా తెలియాల్సి ఉంది. గతంలో జిల్లా కేంద్రంలో నకిలీ స్టాంపులు తయారు చేస్తున్న విషయం కలకలం రేపగా మరోసారి నకిలీ స్టాంపుల అంశం తెరపైకి రావడంతో ఎవరి పేర్లు బయటపడతాయనేది తెలియాల్సి ఉంది.

### ఏ3గా ప్రధాన నిందితుడు!

లబ్ధిదారులను గుర్తించి వారి వద్ద నుంచి డబ్బులు వసూలు చేసే పనిని తండ్రి కొడుకులు రాజా నరేందర్, రాజలింగంలు చూశారని పోలీసులు గుర్తించారు. బాధితులు అధికారుల చుట్టూ తిరగకుండా అంతా మేము చూసుకుంటాం అంటూ వసూళ్లకు తెరలేపింది వీరేనని తెలుస్తోంది. అయితే ఇందులో వీరి పాత్ర ఎంతవరకు ఉందనేది తెలియాల్సి ఉంది. సూత్రధారిగా చెబుతున్న బోయిని ప్రసాద్‌ను కేసులో ఏ3 గా చూపారు. అతనికి సహకరించినట్లు చెబుతున్న రాజా నరేందర్, రాజలింగంలను ఏ1, ఏ2 లుగా చేర్చారు. లబ్ధిదారులను పట్టి డబ్బు వసూలు చేసే వారిని ముందుంచి, మొత్తం దందాను నడిపినట్లు ఆరోపణలు ఉన్న ప్రసాద్‌ను మూడో నిందితుడిగా చూపడం వెనుక మతలబు ఏమిటి అన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. అసలు సూత్రధారిని కాపాడేందుకు ఇది కుట్రా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### 52 దరఖాస్తులు.. డబ్బు రికవరీ చేస్తారా..?

ఒక్క భిక్కనూర్ మండలంలోనే 52 మంది లబ్ధిదారుల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఇందులో 34 మందికి ఇప్పటికే ప్రభుత్వ సాయం అందగా, మిగతా 18 మంది దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయి. అయితే ప్రభుత్వ సాయం పొందిన లబ్ధిదారుల దరఖాస్తులపై కూడా గెజిటెడ్ సంతకాలు ఫోర్జరీ అని తేలితే పరిస్థితి ఏమిటి అన్న చర్చ మొదలైంది. వాటిలో నకిలీ లబ్ధిదారులు ఉన్నారా, ఉంటే వారిపై చర్యలు తీసుకుంటారా, ఇచ్చిన నగదు రికవరీ చేస్తారా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### జిల్లావ్యాప్తంగా విచారణ..

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ప్రభుత్వంలో అత్యంత ప్రజాదరణ పొందిన సంక్షేమ పథకాలు. పార్టీలతో సంబంధం లేకుండా నిరుపేద కుటుంబాలు ఈ పథకాల ద్వారా లబ్ధి పొందాయి. అయితే ఇప్పుడు గెజిటెడ్ సంతకాల ఫోర్జరీ అంశం బయటకు రావడంతో జిల్లా వ్యాప్తంగా ఎంతమంది లబ్ధిదారుల దరఖాస్తులపై ఇలా నకిలీ సంతకాలు పెట్టారో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పథకం కింద లబ్ధి పొందిన వారిపై పూర్తిస్థాయిలో విచారణ జరుపుతారా లేదా అనేది ప్రస్తుతం అందరిలో నెలకొన్న ప్రశ్న.

### పేద కుటుంబాలు లక్ష్యంగా..

ఈ సంక్షేమ పథకాలకు గెజిటెడ్ సంతకం తప్పనిసరి. దీనిని ఆసరాగా చేసుకుని అధికారుల చుట్టూ తిరగలేని పేద కుటుంబాలను లక్ష్యంగా చేసుకుని ఈ రాకెట్ నడిచింది. దీంతో అర్హులైన లబ్ధిదారులకే కాకుండా ప్రభుత్వ పథకాల పారదర్శకతపైనా ప్రశ్నలు వస్తున్నాయి. ప్రస్తుతం కేసు విచారణ దశలో ఉంది. నకిలీ స్టాంపుల మూలాలు, డబ్బు లావాదేవీలు, ఫేక్ లబ్ధిదారుల లెక్కలు కస్టడీ విచారణలో తేలాల్సి ఉంది.



## పొంగిపొర్లుతున్న వాగు.. రాకపోకలు అంతరాయం

**అక్షరటుడే గాంధారి:** మండలంలోని చిన్న పొతంగల్ వద్ద వాగు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు ఉధృతంగా పొంగిపొర్లుతుంది. దీంతో చిన్న పొతంగల్ నుండి పెద్ద పోతంగల్‌కు వెళ్లే దారిపై పూర్తిగా రాకపోకలు స్తంభించాయి. ముఖ్యంగా విద్యార్థులు అప్పర్ ప్రైమరీ విద్య అభ్యసించడానికి వాగు దాటి పెద్ద పోతంగల్‌లోని జడ్పీహెచ్ఎస్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అయితే వర్షాల కారణంగా వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

## జలకళను సంతరించుకున్న మంజీర.. పూజలు చేసిన పోచారం



**అక్షరటుడే, బాన్సువాడ:** జిల్లాలో విస్తారంగా వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు నీటితో నిండిపోయి ప్రకృతి ఆహ్లాదకరంగా మారింది. మంజీర, గోదావరి నదుల్లోకి వరద నీరు భారీగా చేరడంతో జలకళను సంతరించుకున్నాయి. బీర్కూర్ మండల పరిధిలో ప్రవహిస్తున్న మంజీర నదిలో వరద ప్రవాహం పెరిగింది. ఇటీవల నిర్మించిన చెక్‌డ్యామ్ కారణంగా సుమారు రెండు కిలోమీటర్ల మేర నదిలో నీరు నిల్వ ఉండి ఆ ప్రాంతం అందమైన జలాశయాన్ని తలపిస్తోంది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బీర్కూర్ వద్ద మంజీర నది ప్రవాహాన్ని గురువారం ఉదయం పరిశీలించారు. అనంతరం గంగమ్మ తల్లికి పసుపు, కుంకుమ, పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయ కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

## దొంగ ఓట్ల నమోదు కోసమే ‘ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్’



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ప్రభుత్వం తీసుకొచ్చిన ‘ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్’ను ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రామాణికంగా తీసుకోకూడదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం అడిషనల్ కలెక్టర్ భుజంగరావుకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 25వ తేదీన ‘ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్’ను హడావిడిగా తీసుకువచ్చిందన్నారు. రేషన్ కార్డుల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ వ్యవస్థను ఏర్పాటు చేసి, మీ సేవా కేంద్రాల ద్వారా సర్టిఫికెట్లు జారీ చేస్తామని చెబుతోందన్నారు. కానీ సరిగ్గా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే ఈ సర్టిఫికెట్ తీసుకురావడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. పోతన్‌కార్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీ నారాయణ, ప్రమోద్ కుమార్, చింత శ్రీనివాస్ రెడ్డి, ఓంసింగ్ పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా లో ఏకధాటిగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో జిల్లా అదనపు కలెక్టర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కలెక్టరేట్‌లో అత్యవసర పరిస్థితుల్లో స్పందించేవిధంగా కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. వర్షాలపై పూర్తి సమాచారాన్ని కంట్రోల్ రూం ద్వారా సమీక్షిస్తామని అదనపు కలెక్టర్ భుజంగరావు పేర్కొన్నారు. భారీ వర్ష సూచనల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి పరిస్థితి తలెత్తినా సమర్థవంతంగా ఎదుర్కొనేలా సన్నద్ధంగా ఉండాలని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందిని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాల వల్ల ఎక్కడైనా ఇబ్బందులు ఏర్పడినట్లు సమాచారం అందిన వెంటనే అధికారులను అప్రమత్తం చేయాలని కంట్రోల్ రూమ్ సిబ్బందికి సూచించారు. జిల్లాలో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని తెలిపారు. వర్షాల వల్ల జిల్లాలో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే, కలెక్టరేట్‌లో కొనసాగుతున్న కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్: 08462 - 220183 కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

## వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ధన్‌పాల్



**అక్షరటుడే, ఇందూరు:** రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది నగరవాసులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రధానంగా శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్ర పర్చాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిండకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్, ఉన్నతాధికారులతో పాటు సంబంధిత విభాగాధిపతులు సిబ్బందితో సమాచారం తెలుసుకుంటూ ముందుకెళ్లాలని చెప్పారు. నాలాలు సరిగా లేనిచోట ముంపు సమస్య తలెత్తకుండా చూడాలన్నారు.







## సర్వ సమాజ్ ఆధ్వర్యంలో ఘనంగా ‘బండారు’ కార్యక్రమం

నగరంలో ఊరపండుగకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లు ఘనంగా ప్రారంభమయ్యాయి. దీంట్లో భాగంగా ప్రధాన ఘట్టమైన బండారు పోసే కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం ఊర పండుగ ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

- అక్షరటుడే, ఇందూరు

## భారీవర్షాల దృష్ట్యా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి



**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** భారీవర్షాల దృష్ట్యా ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నిజామాబాదు రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ రూరల్ పరిధిలో ఉప్పొంగే వాగులు, వంకలు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. అత్యవసరమైతే తప్ప వర్షంలో బయటకు రావద్దని, పిల్లలను నీటి వద్దకు వెళ్లనివ్వద్దని పేర్కొన్నారు. రైతులు ఉరుములు, మెరుపుల సమయంలో పొలాల్లో ఉండకుండా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. విద్యుత్ స్తంభాలు, తెగిపడిన తీగలకు దూరంగా ఉండాలని.. నీటి ప్రవాహాల వద్ద యువత సెల్ఫీలు, వీడియోల కోసం ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండవద్దన్నారు. ప్రమాదంలో ఉంటే వెంటనే 100 కి కాల్ చేయాలని సూచించారు.

## ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలి



**అక్షరటుడే, నందిపేట్:** మండలంలోని గ్రామపంచాయతీలో జలసిరిపై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఇన్‌ఛార్జి తహశీల్దార్ లక్ష్మణ్ హాజరై ఇంకుడు గుంతల విషయంపై మాట్లాడారు. ప్రతి ఒక్కరి ఇంటి ఆవరణలో ఇంకుడు గుంత, గ్రామంలోని వన్‌హెచ్‌పీ మోటార్ల వద్ద, వ్యవసాయ బోరు బావుల వద్ద బోర్ రీఛార్జ్ డ్రాయింగ్, ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచనలు చేశారు. అనంతరం గ్రామపంచాయతీ సెక్రెటరీ మహేందర్ మాట్లాడుతూ ఇంకుడు గుంతలకి రూ.6130 చొప్పున, వ్యవసాయ బావిలో బోర్‌వెల్ రీఛార్జ్ సెక్షన్‌కు సుమారుగా రూ. 34 వేల చొప్పున ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ఉపాధి హామీ జాబ్ కార్డు ఉన్న ప్రతిఒక్కరు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రం లింగం, ఉప సర్పంచ్ వాసరి రాంచందర్, పాలకవర్గ సభ్యులు, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు, పాల్గొన్నారు.



ప్రజల భద్రతే లక్ష్యంగా కామారెడ్డి జిల్లా పోలీసులు ప్రారంభించిన ప్రత్యేక కార్యక్రమం 'ఆపరేషన్ కవచ్' విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. జిల్లా ఎస్పీ రాజేశ్ చంద్ర దిశానిర్దేశంలో 2025 జూలై 25న ప్రారంభమైన ఈ ప్రివెంటివ్ పోలీసింగ్ వ్యూహం గడిచిన ఏడాదిలో జిల్లాలో నేరాల కట్టడికి కీలకంగా నిలిచింది. రాత్రివేళల్లో రోడ్లపై కాపలా కాస్తూ ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణగా నిలిచిన ఖాకీల కృషిని ప్రజలు కొనియాడుతున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి

# విజయవంతంగా 'ఆపరేషన్ కవచ్'

- గతేడాది జులై 25న ప్రారంభం
- నేరాల నియంత్రణకు పోలీసుల చర్యలు
- గంజాయి రవాణా కేసులో 18 మందిఅరెస్ట్

జిల్లాలో పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు భరోసా కల్పించేలా ఎస్పీ ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నారు. ఫలితంగా ప్రజల్లో పోలీసువ్యవస్థ పట్ల నమ్మకం కలుగుతోంది. ప్రతి కేసు వివరాలను ఎస్పీ పర్యవేక్షిస్తూ పెండింగ్ కేసులు లేకుండా చూస్తున్నారు. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా నేరస్తులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నారు.

### గంజాయి, అక్రమరవాణాపై ఉక్కుపాదం

ఈ ఏడాది కాలంలో గంజాయి నిరోధక చర్యల్లో భాగంగా పోలీసులు 6 ఎన్డీపీఎస్ కేసులు నమోదు చేసి 18 మందిని అరెస్ట్ చేశారు. సుమారు 405 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.2.01 కోట్లు ఉంటుందని అంచనా. ఒడిశా నుంచి మహారాష్ట్ర నాసిక్‌కు భారీగా గంజాయి తరలిస్తున్నట్టు సమాచారం రావడంతో జాతీయ రహదారి 44పై క్యాసంపల్లి వద్ద ప్రత్యేక నిఘా పెట్టి 387.128 కిలోల గంజాయిని పట్టుకున్నారు. అదేవిధంగా నర్సన్నపల్లి వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తుల నుంచి గంజాయిని స్వాధీనం చేశారు. అక్రమ ఇసుక రవాణాపై 11 కేసులు, పశువుల అక్రమ రవాణాపై 3 కేసులు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై 3 కేసులు నమోదు చేశారు. ఒక గుట్కా రవాణా కేసులో రూ.43 లక్షల నగదును సీజ్ చేశారు.

### దొంగల ఆటకట్టు

జిల్లాలో మోటార్ సైకిల్ దొంగతనాలు, ఆయుధాల అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు 18 దొంగిలించిన బైక్‌లు, 5 దేశీయ తుపాకులు, 1 ఎయిర్ గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ చోరీలు, ఆస్తి నేరాలు, ఏటీఎం దొంగతనాలకు పాల్పడిన అంతర్ రాష్ట్ర ముఠాలను అరెస్ట్ చేశారు. అడవి జంతువుల వేటకు పాల్పడుతున్న 8 మంది నిందితులను గాంధారి పోలీసులు పట్టుకుని వారి వద్ద నుంచి 5 నాటు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. యజమానికి తెలియకుండా దొంగిలించిన 5 లక్షల విలువైన ట్రాక్టర్‌ను కేవలం రెండు గంటల్లోనే రికవరీ చేసి అప్పగించారు.

### ఎన్‌ఫోర్స్‌మెంట్, మానవీయ సేవలు

పోలీసుల సేవలు కేవలం కేసులకే పరిమితం కాలేదు. ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో భాగంగా 5,16,984 వాహనాలను తనిఖీ చేసి, 1,19,052 మందిని పాపిలార్ పరికరంతో పరీక్షించారు. 209 మంది అనుమానితులను గుర్తించి 3,572 డ్రంకన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. భిక్కనూర్ టోల్‌ప్లాజా వద్ద మద్యం తాగి బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను పట్టుకుని 45 మంది ప్రయాణికుల ప్రాణాలను కాపాడారు. మానవీయ కోణంలో టెక్రియాల్ జంక్షన్ వద్ద ఒంటరిగా ఉన్న 14 ఏళ్ల బాలుడిని గుర్తించి ఆహారం, కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబానికి అప్పగించారు. సదాశివనగర్ ఎల్లమ్మ గుడి, లింగాపూర్‌లో జరిగిన దొంగతనాలను కొన్ని గంటల్లోనే ఛేదించి నిందితులను పట్టుకున్నారు. పోలీసుల చర్యలతో అంతరాష్ట్ర నేర ముఠాల కార్యకలాపాలు 12 నుంచి 2కి తగ్గాయి.

### ప్రజలకు భరోసా.. నేరస్థులకు భయం



రోడ్లపై జరిగే వాహన తనిఖీలు ప్రజలను ఇబ్బంది పెట్టడానికి కాదు. నేరస్థులను, అక్రమ రవాణాను అరికట్టడానికి మాత్రమే. ప్రతి ఒక్కరి బిడ్డ క్షేమంగా ఇంటికి చేరాలనేదే మా కోరిక. నేటి యువత ఉజ్వల భవిష్యత్తును చెడు మార్గాల నుంచి కాపాడటమే లక్ష్యంగా పని చేస్తున్నాం. ప్రజలకు భరోసా కల్పించడంతో పాటు నేరస్థులకు భయం పుట్టించడమే కామారెడ్డి పోలీసుల నినాదం. ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలి.

**- ఎస్పీ రాజేష్ చంద్ర**



## ఇటుక బట్టీల కార్మికులకు అన్నదానం


**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని జలాల్‌పూర్ శివారులోని ఇటుక బట్టీల వద్ద బాల్కొండ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ సభ్యుడు లయన్ బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరిపారు. ఈ సందర్భంగా మూడు ఇటుక బట్టీలకు చెందిన కార్మికులకు భోజన వసతి కల్పించి అన్నదానం చేశారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి చేయూత అందించడం లయన్స్ క్లబ్ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు చాకు లింగం, జోనల్ ఛైర్మన్ జ్ఞానసాగర్ రెడ్డి, యాదగిరి గౌడ్, రామరాజు గౌడ్, రమాకాంత్, అజీముల్లా, మోతీరామ్, బబ్లు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



## భారీ వర్షాలకు కూలిన ఇల్లు

**అక్షరటుడే, బోధన్:** జిల్లాలో రెండు మూడు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు పలు ఇళ్లు ప్రమాదకర స్థితిలో ఉన్నాయి. సాలూర మండలం ఖాజాపూర్ గ్రామంలో గ్రామస్తుడు సయ్యద్ అహ్మద్ ఇల్లు కుప్పకూలింది. ప్రమాద సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెద్దప్రమాదం తప్పింది. పెంకుటిల్లు కూలి పక్కనే ఉన్న రేకుల షెడ్డుపై పడడంతో రెండు ఇల్లులు ధ్వంసమయ్యాయి. స్థానిక సర్పంచ్, ఉప సర్పంచ్‌లు కూలిన ఇళ్లను పరిశీలించారు. ఇల్లు కూలిపోవడంతో బాధితులు నిరాశ్రయులు అయ్యారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు. అదేవిధంగా సాలూర బోధన్ మండలాలలో రెండు రోజుల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగిపొర్లుతున్నాయి. సాలూరు మండలంలోని మంజీరాలోని వరద భారీగా వచ్చి చేరుతోంది.

## భారీ వర్షాలతో అమ్రాయ్ కాలనీలో అస్తవ్యస్తం




**అక్షరటుడే, మెండోరా:** మూడురోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని పోచంపాడ్‌లోని శ్రీరాంసాగర్ అమ్రాయ్ కాలనీలో కొన్ని ఇళ్లు కూలిపోయే ప్రమాదకర పరిస్థితి నెలకొంది. దీంతో అధికారులు అప్రమత్తమై ప్రమాదం పొంచి ఉన్న ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టారు. మెండోరా ఎస్సై సుహాసిని సంఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రెవెన్యూ శాఖ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రమాదకర ప్రాంతాలను సందర్శించి అవసరమైన సహాయక చర్యలు చేపట్టారు. అమ్రాయ్ కాలనీలో మొత్తం 60 కుటుంబాలు నివాసం ఉంటుండగా, వీరిలో 28 కుటుంబాలకు ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మరో 22 కుటుంబాల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మిగిలిన అర్హులైన కుటుంబాలకు కూడా త్వరగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, వారిని శాశ్వతంగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సర్పంచ్ మాధురి రాజు, ఉప సర్పంచ్ సంపంగి సతీష్ పాల్గొన్నారు.

## పోచంపాడ్‌లో జల విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న నిరసనలు




**అక్షరటుడే,మెండోరా:** మండలంలోని పోచంపాడ్ జలవిద్యుత్ కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, కార్మికులు చేపట్టిన నిరసన గురువారం 33వ రోజుకు చేరుకుంది.యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కోల్, యాష్ ప్లాంట్ల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు పిలిచిన టెండర్ల ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉద్యోగులు, కార్మికులు ప్రతిరోజూ భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహిస్తూ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా తమ నిరసనను వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, ఇప్పటివరకు యాజమాన్యం నుంచి సమస్య పరిష్కారంపై ఎలాంటి స్పష్టమైన హామీ రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యకు పరిష్కారం లభించే వరకు తమ నిరవధిక ఆందోళన కొనసాగుతుందని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు.

## ప్రాణ సంకటంగా మారిన కలెక్టరేట్ రహదారి



**అక్షరటుడే, కామారెడ్డి:** పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు వెళ్లే అశోక్ నగర్ ప్రధాన రహదారి పాలకుల, అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మారింది. రెండుమూడురోజులుగా కురుస్తున్న వర్షంతో రోడ్డంతా గుంతలలో నీళ్లు చేరి ప్రమాదకరంగా మారింది. ఆ గుంతల్లో నీరు నిలిచి ఉండటంతో రోడ్డు ఎక్కడ ఉందో, గుంత ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ మార్గంలో రోజూ వేలాది వాహనాలు, విద్యార్థులు, ఉద్యోగులు, సామాన్య ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. కానీ రోడ్డు దుస్థితి కారణంగా ఒక్క అడుగు ముందుకు వేయాలంటేనే భయపడాల్సి వస్తోంది. బైక్ లు జారి పడుతున్నాయి, ఆటోలు గుంతల్లో ఇరుక్కుపోతున్నాయి. ఇప్పటికే పలు ప్రమాదాలు జరిగినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ప్రాణాలు పోతేనేనా అధికారులు, పాలకులు స్పందిస్తారా అని వాహనదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్ కు వెళ్లే అతి ముఖ్యమైన రహదారి ఇలా ఉండటంపై చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



## విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి

**అక్షరటుడే,కోటగిరి :** విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి చెందాయి. కోటగిరి మండలం సుద్దులం గ్రామంలో ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిలు తన రెండు ఆవులను తీసుకొని మేపేందుకు వెళ్తుండగా గ్రామ ముఖద్వారం వద్ద సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యాదాఘాతానికి గురై మృతి చెందాయి.

## కుక్కల బారి నుంచి చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు



**అక్షరటుడే, బాన్సువాడ:** వీధికుక్కలు చిన్నారులపై దాడి చేసిన ఘటనల నేపథ్యంలో బాన్సువాడ పురపాలక సంఘం అప్రమత్తమైంది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో చిన్నారుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రత్యేక చర్యలను ప్రారంభించినట్లు మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ తెలిపారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, వీధి కుక్కలను గుర్తించి పట్టుకునే కార్యక్రమాన్ని వేగవంతం చేశారు. ఎక్కడైనా వీధి కుక్కల వల్ల ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే వెంటనే పురపాలక సంఘానికి సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలకు వెళ్లే, తిరిగి వచ్చే సమయంలో పిల్లలతో పాటు పెద్దలు ఉండేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బుధవారం వీధి కుక్కల దాడిలో గాయపడిన చిన్నారిని కమిషనర్ గోపు గంగాధర్ పరామర్శించారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని, కుటుంబ సభ్యులతో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. చిన్నారికి అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

## ఎస్ఐఆర్‌లో ఎల్లారెడ్డి ప్రత్యేకం.. రాష్ట్రంలోనే మూడో స్థానం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి నియోజకవర్గం వందశాతం ఎస్ఐఆర్ పూర్తిచేసి రాష్ట్రంలోనే మూడో స్థానంలో నిలిచింది. జిల్లాలో ప్రథమంగా సర్ ప్రక్రియ పూర్తిచేసినందుకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎమ్మెల్యే మదన్‌మోహన్ అధికారులకు, ప్రజాప్రతినిధులకు, బీఎల్‌వోలకు అభినందనలు తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,28,503 ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేసి, వాటిని బీఎల్‌వోలు యాప్‌ల ద్వారా వందశాతం డిజిటలైజేషన్ పూర్తిచేశారు. 22,283 మంది ఓటర్లను మృతిచెందిన, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిగా, డబుల్ ఓటర్లుగా గుర్తించారు. నియోజకవర్గంలో 1,200 మందికి పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజించి కొత్త కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా గాంధారిలో 5, లింగంపేటలో 8, నాగిరెడ్డిపేటలో ఒకటి, సదాశివనగర్‌లో 4, ఎల్లారెడ్డిలో 2 కేంద్రాలు కొత్తగా రానున్నాయి. ఆగస్టు 10న డ్రాఫ్ట్ ఓటరు జాబితా నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 10 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరించనున్నారు. అక్టోబర్ 10న తుది ఓటరు జాబితా విడుదల చేస్తారు.

## ఇందూర్ లయన్స్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం



**అక్షరటుడే, ఇందూరు:** లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ జి.బాబూరావ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని రాజరాజేంద్ర చౌరస్తా, బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాల్లో పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్షుడు పి.రాఘవేందర్ బాబు మాట్లాడుతూ ప్రతీ ఏడాది లయన్స్ ఇంటర్నేషనల్ పాస్ట్ డైరెక్టర్ డాక్టర్ బాబురావ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా పది జిల్లాలలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ర్యక్రమంలో లయన్స్ జిల్లా అదనపు క్యాబినెట్ కార్యదర్శి కరిపె రవీందర్, జోన్ ఛైర్మెన్ అబ్బాయి లింబాద్రి, ప్రోగ్రామ్ ఛైర్మన్ ఇరుమల శివలింగం, ఇందూర్ క్లబ్ కార్యదర్శి చింతల గంగాదాస్, కోశాధికారి అంకం రాజేందర్ పాల్గొన్నారు.